సమస్యలుంటే సాక్షికి చెప్పండి


మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

కొండవాలు కాలనీలు.. వానొస్తే దిగాలు

తెరిపి లేని వానలతో బిక్కుబిక్కుమంటున్న ప్రజలు


గాజువాకలో కొండపై నివాసాలు

గాజువాక: ఎడతెరిపి లేని వానలతో గాజువాకలోని కొండవాలు ప్రాంతాల నివాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. చిన్నపాటి వానొస్తేనే కలవరానికి గురయ్యే వారు, వరుస వర్షాలతో కలవరపడుతున్నారు. ఏ కొండపై ప్రమాదం జరుగుతుందో, ఎక్కడ గోడకూలిన ప్రమాద వార్త వినిపిస్తుందోననే ఆందోళనతో కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

గాజువాక పట్టణంలోని ఆరు వార్డుల పరిధిలో 12 కొండవాలు కాలనీలున్నాయి. 20వేల కుటుంబాలకు పైగా స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. 65వ వార్డు భానోజీ కాలనీ, సంజీవిగిరి కాలనీ, 70వ వార్డు ఎల్‌బీఎస్ నగర్, దశమికొండ, 71వ వార్డు శ్రీనగర్, సుందరయ్య కాలనీ, 73వ వార్డు సింహగిరి కాలనీ, 74వ వార్డు దయాళ్‌నగర్, పైడిమాంబ కాలనీ, 67వ వార్డు పెంటయ్యనగర్, కృష్ణానగర్, గణేష్‌నగర్, బొజ్జన్నకొండ కాలనీలున్నాయి. తెరిపి లేకుండా వర్షాలు కురిసినప్పుడల్లా కొండలు నానిపోయి నివాసాలు కూలిపోతున్నాయి. ఏ కొండపై ప్రమాదం చోటు చేసుకున్నా ఈ కాలనీల్లో నివాసులకు ఆందోళనగానే ఉంటోంది.

ప్రమాదాలు.. ప్రాణ నష్టం

- 2024 : 74, 65వ వార్డుల్లో గోడలు కూలి జనం ఆందోళన చెందుతున్నారు.
- 2019 : మట్టి పెళ్లలు జారి పడటంతో కొత్త గాజువాక పెట్రోల్ బంక్ ఎదురుగా కొండవాలులో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లోని రెండు ఫ్లాట్లు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటనలో భార్యాభర్తలు గాయపడ్డారు.
- 2018 : బీసీ రోడ్‌లోని సంజీవిగిరి కాలనీ కొండపై గతంలో ప్రమాదం చోటుచేసుకుంది. మట్టిపెళ్లలు విరిగి పడటంతో నివాసులు ఆందోళనకు గురయ్యారు. ఈ సంఘటనలో రెండిళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి.
- 2017 : అంతకుముందు డ్రైవర్స్ కాలనీలో రక్షణ గోడ కూలిపోవడంతో నివాసులు ఆందోళన చెందారు.
- 2016 : గాజువాక హైస్కూల్ రోడ్‌లోని పెంటయ్యనగర్‌లో మట్టిపెళ్లలు జారి పడటంతో పూరిల్లు ధ్వంసమైంది. ఆ ఇంట్లో నివాసముంటున్న యువతి గాయాలపాలైంది. ఆమె మెలకువగా ఉండటంతో ప్రాణాపాయం తప్పింది.
- 2015 : సింహగిరి కాలనీ కొండపై షెడ్డు కూలిపోవడంతో దంపతులు మృతి చెందారు. ఆ తరువాత (2016లో) కూడా ఆ ప్రాంతంలో ఒక షెడ్డు కూలి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు.
- 2012 : బొజ్జన్నకొండపై మట్టిపెళ్లలు విరిగి పడటంతో ఒక మహిళ దుర్మరణం పాలైంది.
- 2011 : సుందరయ్య కాలనీలో ఇదే తరహా ప్రమాదంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.
- 2011 : గాజువాక హైస్కూల్ రోడ్ కృష్ణానగర్‌లో కొండ చరియలు విరిగిపడి ఇద్దరు చిన్నారులు దారుణంగా మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు.
- 2010 : పెంటయ్యనగర్‌లో కొండ చరియలు విరిగిపడి ఇద్దరు కూలీలు, ఒక చిన్నారి మృత్యువాత పడ్డారు.
- 2009 : శ్రీనగర్ కొండ భాగంలో ఓ ఇంటి నిర్మాణం కోసం పునాదులు తవ్వుతుండగా గోడ కూలి ఇద్దరు తాపీ మేస్త్రీలు మృతి చెందారు.

శాఖల మధ్య సమన్వయ లోపం

కొండలపై నివాసం ఉన్నవారికి రక్షణ కల్పించే విషయంలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించడం లేదన్న ఆరోపణలున్నాయి. కొండ ప్రాంతాల రక్షణ బాధ్యతను ఒకరిపై మరొకరు నెట్టేసుకుంటూ సమస్యను విస్మరిస్తున్నారని నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండలపై ఆక్రమణలు జరిగిపోతుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని జీవీఎంసీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు సౌకర్యాలు కల్పిస్తుండటం వల్లే ఆక్రమణలు పెరిగిపోతున్నాయని రెవెన్యూ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ రెండు వాదనల్లోనూ వాస్తవం ఉన్నప్పటికీ వారు ప్రజల రక్షణ బాధ్యతను విస్మరిస్తున్నారనే విమర్శలున్నాయి.

క్లుప్తంగా

వర్షాలకు కూలిన ఆలయ ప్రహరీ


కూలిన గోడను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పెదగంట్యాడ: గత ఐదు రోజులుగా తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 65వ వార్డు పరిధి భానోజీ కాలనీ రాజీవ్ మార్గంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఆనుకుని ఉన్న ప్రహరీ మంగళవారం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీనిపై సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు రెట్టి వాసు, దేముడు, ప్రసాద్ సుజాత, మంగ తదితరులు పరిశీలించారు.

డీఏవీ అభివృద్ధికి సంజీవరావు సేవలు అమూల్యం


స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావును సత్కరిస్తున్న పాలకవర్గం, ప్రిన్సిపాల్

ఉక్కునగరం: డీఏవీ పాఠశాల అభివృద్ధికి స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్ఆర్) కె. సంజీవరావు చేసిన సేవలు అమూల్యమైనవని స్టీల్‌ప్లాంట్ వెల్ఫేర్ విభాగం జీఎం ఎం.మధుసూదనరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ జీఎం, పాఠశాల ఎల్ఎంసీ కమిటీ చైర్మన్ కె.సంజీవరావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఎల్ఎంసీ కమిటీలు సంయుక్తంగా ఆయన్ను సత్కరించాయి. కార్యక్రమంలో మధుసూదనరావు మాట్లాడుతూ చైర్మన్‌గా సంజీవరావు పాఠశాల విద్యార్థుల ఫీజులు పెంపు చేయకుండా, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నైస్ షాజి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారిపై కలెక్టర్, సీపీకి ఫిర్యాదు

అగనంపూడి: ఒంటరి మహిళల స్థలాలు ఆక్రమించి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్న నిర్వాసిత కాలనీకి చెందిన ఉక్కు అధికారి వెంకటరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, ఉక్కు ఎస్టీసీలకు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తి గతంలో దిబ్బపాలెంకు చెందిన ఒక వృద్ధురాలి ఆస్తిని కాజేశారని తెలిపారు. ఇప్పుడు అదే వ్యక్తి గుదే నారాయణమ్మ అనే ఒక బధిర ఒంటరి మహిళకు చెందిన ఆర్ నంబర్ స్థలాన్ని కాజేసేందుకు యత్నాలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో న్యాయ విచారణ జరిపి నిర్భాగ్యులు, ఒంటరి మహిళలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

సీఆర్‌జెడ్ పరిధిని కాపాడాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతంలో ఆక్రమణకు గురవుతున్న సీఆర్‌జెడ్ పరిధిని కాపాడాలని గ్రామ మత్స్యకారులు కోరారు. ఈ మేరకు మత్స్యకారులు మంగళవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న భారీ చెట్లను కొంతమంది తొలగిస్తున్నారని పేర్కొన్నారు. పంచాయతీ అనుమతులు, ల్యాండ్ కన్వర్షన్ సర్టిఫికెట్లు లేకుండా లేఅవుట్లు వేసి సీఆర్‌జెడ్ పరిధిని జిరాయితీగా చూపిస్తున్నారన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని సీఆర్‌జెడ్ పరిధి యధావిధిగా ఉండేలా చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన కె.మహేష్, నంబారి, కొర్లయ్య, ఎం.మహేష్ కోరారు.

హైవేపై ప్రమాదకరంగా గోతులు


నాతయ్యపాలెం వైపు ప్రమాదకరంగా ఉన్న గోతులు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ రహదారిపై గోతులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ గోతుల్లో పడి నిత్యం ఎంతోమంది గాయాలపాలవుతున్నారు. గతంలో నాతయ్యపాలెం వైపు గోతిలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. షీలానగర్ నుంచి భెల్ సిగ్నల్ పాయింట్ వైపు వెళ్లే మార్గంలో అక్కిరెడ్డిపాలెం వాటర్ ట్యాంక్ ఎదురుగా జాతీయ రహదారిపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఈ గోతిలో సోమవారం రాత్రి ఓ ద్విచక్ర వాహనచోదకుడు పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇదే గొయ్యికి ఎదురుగా భెల్ సిగ్నల్ పాయింట్ నుంచి షీలానగర్ వైపు వెళ్లే మార్గంలో నాతయ్యపాలెం వైపు కూడా ఓ గొయ్యి ఏర్పడింది. ఈ రెండు గోతుల్లో ఎంతోమంది ద్విచక్ర వాహన చోదకులు పడి ప్రమాదాలకు గురై, తీవ్ర గాయాలపాలవుతున్నారు. నాతయ్యపాలెం వైపు ఉన్న గొయ్యిని గాజువాక ట్రాఫిక్ పోలీసులు రెడీ మిక్స్ కాంక్రీట్‌తో పూడ్చినప్పటికీ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి, గోతులు పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


అక్కిరెడ్డిపాలెం వైపు వాటర్ ట్యాంక్ ఎదురుగా రోడ్డుపై గొయ్యి

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం


ఉక్కు టీటీఐ కూడలి వద్ద జెండా ఎగరవేస్తున్న బీఎంఎస్ నాయకులు

ఉక్కునగరం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం నిర్వహించారు. స్టీల్ బీఎంఎస్ ఆధ్వర్యంలో ఉక్కు టీటీఐ కూడలి, యూనియన్ కార్యాలయాల వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు పార్టీ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1993లో స్టీల్‌ప్లాంట్‌లో బీఎంఎస్ యూనియన్ ప్రారంభమైందన్నారు. బీఐఎఫ్ఆర్ సమయంలో నాటి ప్రధాని వాజ్‌పేయి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, స్టీల్‌ప్లాంట్ రక్షణలో కీలక పాత్ర పోషించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఉద్యోగుల హెచ్ఆర్ఏ పరిష్కారంలోనూ ముఖ్య భూమిక వహించిందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రామస్వామి, జె.రమణ, గురుప్రసాద్, మద్దాల పెంటారావు, కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు కేటాయింపులేవీ?

- బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్‌కు మొండిచెయ్యి
- స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్
- 1258వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు


మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

అగనంపూడి: ఎన్నికల ముందు విశాఖ ఉక్కు పరిరక్షణ మా వల్లే సాధ్యమని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం నేడు పరిరక్షణకు బడ్జెట్‌లో కనీస కేటాయింపులు చేయకపోవడం అన్యాయమని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1258వ రోజు, మంగళవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. రాజధాని అమరావతికి రూ.15వేల కోట్ల నిధులు కేటాయిస్తామని బడ్జెట్‌లో పొందుపర్చిన కేంద్రం విశాఖ ఉక్కు విషయంలో మాత్రం కనీసం కేటాయింపులు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఆర్థిక సహాయం అందించాలని మూడున్నర సంవత్సరాలుగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోపోవడం, తీరా ఎన్నికల్లో ప్రజలకు బీజేపీకి సముచిత స్థానం ఇచ్చినా కూడా మొండిచేయి చూపడం దుర్మార్గమన్నారు. విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ ఇదే తీరు కనపర్చారన్నారు. రాష్ట్రానికి అన్ని విధాలుగా నమ్మక ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలకు రాష్ట్రంపై ఎలాంటి అభిప్రాయం, ప్రేమాభిమానాలు ఉన్నాయో స్పష్టం అవుతోందన్నారు. కనీసం రెండు శాతం ఓట్లు కూడా లేని బీజేపీని పోటీ చేసిన దాదాపు అన్నిప్రాంతాల్లో గెలిపించిన రాష్ట్ర ప్రజలకు బీజేపీ చేసిన ద్రోహం అంతులేనిదన్నారు. దీక్ష శిబిరంలో నాయకులు కొమ్ము ప్రసాద్, పీవీబీవీ గోపాలరాజు, డి.ఆదినారాయణ, కె.సత్యనారాయణరావు, నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, జి.ప్రభాకర్ రెడ్డి, జి.గురుమూర్తి, మధు, వై.శ్రీను, ఆకుల నూకరాజు, దండు మోహన్, మద్ది అప్పలరాజుతో పాటు ఉక్కు పరిరక్షణ కమిటీ, ఇంటక్ నాయకులు, సీవో అండ్ సీసీపీ, సీఆర్ఎంపీ, ఈఎండీ, ఈఆర్ఎస్, డీఎన్‌డబ్ల్యూ, సీఎంఈ విభాగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక చిత్రం 'కళ్లు'

సీతంపేట: కళ్లు ఒక ప్రయోగాత్మక సినిమా అని, విశాఖలోని ఎంతో మంది వ్యక్తుల సహకారం, స్థానిక కళాకారులతో ఈ చిత్రం తీశామని దర్శకుడు ఎం.వి.రఘు అన్నారు. కళ్లు చిత్రం తీసి 35 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రంగసాయి మీడియా వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రఘు మాట్లాడుతూ స్వాతిముత్యం సినిమా వచ్చిన రోజుల్లో కళ్లు సినిమా తీశామన్నారు. గొల్లపూడి మారుతీరావు రచించిన నాటికను సినిమాగా తీశామని తెలిపారు. ఈ సినిమాకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడినపాటలు, సిరివెన్నెల సాహిత్యం సినిమాకి హైలెట్ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ కళ్లు సినిమాకు 24 అవార్డులు రాగా, అందులో దర్శకుడికి 11 అవార్డులు రావడం విశేషమన్నారు. 1988లో విడుదలైన సినిమా వందరోజులు ఆడిందన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రఘు, ఇతర కళాకారులను సత్కరించారు. అనంతరం కళ్లు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రంగసాయి ప్రతినిధి ఎన్.నాగేశ్వరరావు, ఎంపీఎస్ హరనాథరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళ్లు చిదంబరం కుమారుడు రామకృష్ణ, జనసేన నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో మెండుగా ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న ఫార్మా సైంటిస్ట్ వెంకట్ ఇకుర్తి

అగనంపూడి: ఫార్మారంగంలో మెండుగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని అమెరికాకు చెందిన డేటా పరిశోధకుడు వెంకట్ ఇకుర్తి అన్నారు. ఆ దిశగా పరిశోధనలు సాగించాలని సూచించారు. 'ఫార్మా రంగంలో పరిశోధనలు – స్టాటిస్టికల్ విద్య' అంశంపై దువ్వాడలోని విజ్ఞాన్ ఫార్మా కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్లినికల్ రీసెర్చ్, సాస్ ప్రోగ్రామ్‌ల గురించి వివరించారు. ఫార్మా రంగంలో అవకాశాలు, కెరీర్‌పై విద్యార్థులు దృష్టి సారించారు. ఔషధ ఆవిష్కరణ, డ్రగ్ డెవలప్‌మెంట్, క్లినికల్ ట్రయల్స్, స్టాటిస్టికల్ విద్యపై వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కమల కుమారి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వసుధ, వివిధ విభాగాల అధిపతులు సరిత, చిరంజీవి, వసంత, రంజిత తదితరులు మాట్లాడారు.

స్టాప్ డయేరియాపై అవగాహన కల్పించాలి


మధురవాడ వాంబే కాలనీ యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: స్టాప్ డయేరియాపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం వాంబే కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. యూపీహెచ్‌సీ పరిధిలో గర్భిణులు ఎంత మంది ఉన్నారో జాబితా సిద్ధం చేయాలని, ఎనీమియా లబ్ధిదారులను గుర్తించాలని ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు తెలిపారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు అందచేయాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు. ఓపీ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సృజనకు మరింత మెరుగులద్దుతూ..

- ఆకట్టుకుంటున్న బోధనోపకరణాలు
- పాఠశాలల్లో ఉత్సాహంగా శిక్షా సప్తాహ్


మింది హైస్కూల్లో అబాకస్‌పై లెక్కలను వివరిస్తున్న విద్యార్థిని


లంకెలపాలెం హైస్కూల్‌లో బోధనోపకరణాల ప్రదర్శనను తిలకిస్తున్న హెచ్ఎం నాగేశ్వరరావు


మింది హైస్కూల్లో ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ప్రముఖుల చిత్రపటాలు

అగనంపూడి: నూతన విద్యా చట్టం (ఎన్ఈపీ) నాల్గో వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమాల్లో భాగంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా కోవిదులు, పండితులు, రచయితల ఫొటోలు, వారి ప్రాముఖ్యతను వివరించారు. అలాగే హిందీ, సైన్స్, గణితం పాఠ్యాంశాలకు సంబంధించి వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రౌతు నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఉపాధ్యాయులు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- పెదముషిడివాడ పాఠశాలలో అన్ని పాఠ్యాంశాలకు సంబంధించి వివిధ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టేలా నమూనాలను రూపొందించారు.
- వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు బోధనకు ఉపయోగించే వివిధ నమూనాలను, వర్కింగ్ మోడల్స్‌ను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పందిరి కనకేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గోవడం వల్ల విద్యార్థుల ప్రతిభా పాటవాలు బయటపడతాయన్నారు. వాటికి మరింత మెరుగులద్ది ప్రోత్సహించేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమేష్‌బాబు, నారాయణరెడ్డి, కూర్మారావు, సంజీవరావు, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మింది జెడ్పీ హైస్కూల్లో..

అక్కిరెడ్డిపాలెం: మింది పాఠశాలలో నిర్వహించిన శిక్షా సప్తాహ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైన్స్, మ్యాథ్స్, సోషల్ తదితర సబ్జెక్టులకు సంబంధించిన నమూనాలు, ప్రముఖుల చిత్రపటాలు రూపొందించి ప్రదర్శనలో ఉంచారు. అబాకస్ ద్వారా విద్యార్థులతో లెక్కలు చేయించారు. బృందాలుగా మ్యాథ్స్ పజిల్స్ చేశారు.


వాడచీపురుపల్లి పాఠశాలలో నమూనాల గురించి తెలుసుకుంటున్న హెచ్ఎం కనకేశ్వరరావు

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు

అక్కిరెడ్డిపాలెం: ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ డిప్లమో పారామెడికల్ కోర్సుల్లో కన్వీనర్ కోటా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించినట్లు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆగస్టు 6వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఇంటర్‌లో ఏ గ్రూపు లో పాసైన విద్యార్థులైనా ఈ కోర్సులకు అర్హులని పేర్కొన్నా రు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 79950 13421, 72079 53919 సెల్ నంబర్లకు, లేదా షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్ నందు సంప్రదించాలని కోరారు.



అప్రోచ్ రోడ్డు లేక అవస్థలు


నిర్మాణానికి నోచుకోని అప్రోచ్ రోడ్డు

అక్కిరెడ్డిపాలెం: నాతయ్యపాలెం గ్రామం నుంచి సర్వీసు రోడ్డు పక్కనున్న కార్ కేర్ షాప్ వరకు నిర్మించాల్సిన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి నోచుకోక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. 2024 జనవరి 29న అప్పటి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డితో కలిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.19.24 లక్షలతో నిర్మించాల్సి రోడ్డు పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. గ్రామంలో ఎటువంటి ప్రమాదం జరిగినా కనీసం అంబులెన్స్ రాని పరిస్థితి. రోడ్డు నిర్మిస్తే ఇక్కడ సుమారు 300 కుటుంబాలకు ఉపయోగకరంగా ఉంటుంది. నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డు నిర్మాణ పనులు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తిరుమలేశునికి ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం భక్తులు సామూహికంగా పారాయణలు చేశారు. దివ్యక్షేత్రం ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com